క్లుప్తంగా

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో కృష్ణవేణి విద్యార్థుల సత్తా



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపల్

నరసరావుపేట ఈస్ట్: కృష్ణవేణి డిగ్రీ కళాశాల (అటానమస్) ప్రథమ సంవత్సరం డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో 78 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. తమ విద్యార్థులు బిఎస్సీ విభాగం ఏఐలో ఎం.వెన్సీ 99 శాతం, కంప్యూటర్స్‌లో ఎం.భవాని 97.5, డిఎస్‌లో టి.దేదీప్య 96.1, బోటనీలో డి.స్రవంతి 95.3, కెమిస్ట్రీలో జి.మల్లిక 94.6, జువాలజీలో ఎం.సతీష్‌కుమార్ 94, ఫిజిక్స్‌లో షేక్.రేష్మాసుల్తానా 92, హోంసైన్స్‌లో పి.నాగదీప్తి 92, బీకామ్ కంప్యూటర్స్‌లో కెఎస్ఎస్ నాగశరణ్య 97.6, బిసీఏలో సిహెచ్.దత్తాత్రేయ 94, బీబీఏలో ఎం.గాయత్రీ 93.1, బీబీఏలో కె.నిర్మలా కుమారిబాయి 92 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించారని వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.నాసరయ్య, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ డి.యోగేశ్వరరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వై.శ్రీకాంత్, ఎం.సురేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో కిశోరి వికాసం

రొంపిచర్ల : మండలంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. మండలంలో వడ్లమూడివారి పాలెం, రామిరెడ్డిపాలెం, మాచవరం, నల్లగార్లపాడు, రొంపిచర్ల, అన్నవరం, ఆరేపల్లి, విప్పర్ల గ్రామాలలో గల అంగన్వాడీ కేంద్రాలలో కిశోరి వికాసం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలలో కిశోరీ బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్స్ చట్టం గురించి అవగాహన కలిగించారు. ఆయా గ్రామాలలో కిశోరీ వికాసం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సీహెచ్ ఉమామహేశ్వరీ, ఐసీడీయస్ సూపర్ వైజర్లు షమీమ్ సుల్తానా, దేవి, అంగన్వాడీ టీచర్లు, కిశోర బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగ్గురికి గాయాలు

శావల్యాపురం: మండలంలోని కృష్ణాపురం గ్రామ సమీపాన గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి మార్గంలో మంగళవారం అశోక్ లైలాండ్ నాలుగు చక్రాల వాహనాన్ని ప్రమాదవశాత్తు కారు ఢీకొట్టిన సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల తెలిపిన వివరాలు మేరకు నూజెండ్ల మండలం చింతలచెర్వు గ్రామానికి చెందిన రైతు పాలిబోయిన వెంకటేశ్వర్లు మిరపకాయలోడు తీసుకొని లైలాండ్ వాహనంలో గుంటూరుకు తీసుకుని వెళుతున్నాడు. ఈక్రమంలో నరసరావుపేట నుంచి వినుకొండ వైపుకు కారు వస్తుండగా అదుపు తప్పి అశోక లైలాండ్ వాహనాన్ని కారు అతివేగంతో ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలు కాగా 108 అత్యవసర వాహనం ద్వారా వినుకొండ వైద్యశాలకు తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు తన సిబ్బందితో పరిశీలించి ప్రమాదం జరిగిన తీరు అడిగి తెలుసుకున్నారు.

నేడు మాదిగ ఉద్యోగుల సమైఖ్య సమావేశం

నరసరావుపేట: స్థానిక స్టేషన్ రోడ్డులోని విజయరెసిడెన్సీలో గురువారం సాయంత్రం నాలుగు గంటలకు మాదిగ ఉద్యోగుల సమైక్య (ఎంఇఎఫ్) సమావేశం జరుగుతుందని, దీనికి నియోజకవర్గంలోని మాదిగ ఉద్యోగులు అందరూ హాజరై జయప్రదం చేయాలని ఎంఇఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు దాసరి నాగయ్య మాదిగ కోరారు. మంగళవారం కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. సమావేశంలో జాయింట్ సెక్రెటరీ అమృతపూడి శేఖర్‌మాస్టర్, జిల్లా అధ్యక్షులు వంగూరి అశోక్ మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ గరికపాటి హిట్లర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి చిరుగూరి నాగరాజు మాదిగ పాల్గొన్నారు.

డిమాండ్లపై నేతలతో ప్రభుత్వం చర్చలు జరపాలి

నరసరావుపేట: ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఉద్యోగులైన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల (సీహెచ్ఓ)లకు గత నెల జీతంతో పాటు వేతన సవరణ, ప్రావిడెంట్ ఫండ్ అంశాలపై ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని ఉద్యోగ సంఘ నాయకులు కోరారు. తమ డిమాండ్ల సాధనకోసం స్టేషన్‌రోడ్డులోని గాంధీపార్కు వద్ద చేస్తున్న నిరవధిక సమ్మె మంగళవారం కూడా కొనసాగించారు. ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని జిల్లా నాయకులు అనుపమ, సాగర్, వినోద్, మస్తాన్ కోరారు.

లైంగిక వేధింపుల నుంచి రక్షణ ఛత్రం పోక్సో చట్టం

చిలకలూరిపేటటౌన్: బాలికలకు లైంగిక వేధింపుల నుండి రక్షణ ఛత్రంగా పోక్సో చట్టం ఉందని దానిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ నాదెండ్ల ప్రాజెక్టు సీడీపీవో జి శాంతకుమారి చెప్పారు. చిలకలూరిపేట పట్టణంలోని సాంబశివనగర్‌లోని స్లమ్–2 సెక్టార్ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీవో మాట్లాడుతూ కేంద్రం పరిధిలోని కిశోర బాలికలకు బాలల రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

ఏం టీ ఈ పనీ?!

- ప్రజాప్రతినిధుల ఆదేశాలతో మెట్లమార్గంలో వ్యాపారం
- ఇబ్బందిపడుతున్న సచివాలయ ఉద్యోగులు, వినియోగదారులు
- ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా మార్కెట్ యార్డు షాపింగ్ కాంప్లెక్స్‌లో ఇదీ పరిస్థితి

నడిచే దోవ – ఆక్రమణదారుడి పెడదోవ!!



పై అంతస్తుకు వెళ్లే దారిలో ఏర్పాటుచేసిన స్టూల్స్, తినుబండారాలు

నరసరావుపేట: అధికారం తలకెక్కితే.. ప్రజలకు తిప్పలు తిప్పవని నానుడి. ఇందుకు ఇదే నిదర్శనం. ఉద్యోగులు, వినియోగదారులు రాకపోకలు సాగించాల్సిన దారినే ఆక్రమిస్తూ కూల్‌డ్రింక్స్, టీలు విక్రయించే బంకు ఏర్పాటుచేసి వారికి ఇబ్బందులు కలిగిస్తున్న తీరు చర్చనీయాంశమైంది.. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా మార్కెట్ యార్డుకు చెందిన వాణిజ్య సముదాయం ఉంది. దీనిలోని పై అంతస్తులో రెండు సచివాలయాలు, మరో రెండు కార్యాలయాలు ఉన్నాయి. ఉద్యోగులు, వినియోగదారులు పై అంతస్తుకు చేరేందుకు మెట్లుమార్గం ఉంది. ఆ మార్గంకు ముందున్న ఖాళీ ప్రదేశంలో స్థానిక కూటమి నేతల సహాయ సహకారాలు, యార్డు అధికారుల ఆమోదంతో ఓ వ్యక్తి కూల్‌డ్రింక్స్, టీబంకు ఏర్పాటు చేశాడు. దీంతో ఆ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించే వారికి అవస్థలు మొదలయ్యాయి.

స్టూళ్లు వేసి మరీ....

టీ బంకు నిర్వాహకుడు తన వద్దకు వచ్చే వినియోగదారులు కూర్చునేందుకు మెట్ల మార్గంకు వెళ్లేదారిలో స్టూళ్లు ఏర్పాటు చేశాడు. దీంతో పై అంతస్తుకు వెళ్లేవారు నడిచేందుకు కేవలం రెండు అడుగుల వెడల్పు మార్గమే ఉంది. ముగ్గురు మనుషులు ఆ బంకు వద్దకు వస్తే వచ్చిపోయే వారికి దారే కన్పించదు. దీంతో బిల్డింగ్ పైకి వెళ్లడానికి మెట్లు ఎటు వైపు ఉన్నాయో వెతుక్కోవాల్సిన పరిస్థితి దాపురించింది. సచివాలయాల్లో ఎక్కువగా మహిళా ఉద్యోగులే పనిచేస్తున్నారు. రాకపోకలు సాగించేందుకు మగవారు అడ్డుగా నిల్చుండటంతో చాలా ఇబ్బందికరంగా ఉంటుందని సచివాలయ మహిళా ఉద్యోగులు వాపోతున్నారు.



మార్కెట్‌యార్డు షాపింగ్ కాంప్లెక్స్ పై అంతస్తుకు వెళ్లేదారిలో ఏర్పాటుచేసిన టీబంకు



పై అంతస్తుకు వెళ్లేదారిలో అడ్డం ఉండకూడదంటూ మెట్ల మార్గం మొదట్లో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

నాయకులు చెప్పారని అద్దెకిచ్చాం!

దీనిపై మార్కెట్‌యార్డు కార్యదర్శి కె.సూర్యప్రకాష్‌రెడ్డిని వివరణ కోరగా ప్రజాప్రతినిధుల కోరిక మేరకు అక్కడ కూడా అద్దె ప్రాతిపదికన వ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఇచ్చామని పేర్కొన్నారు.

పెండింగ్ చలానాలు చెల్లించండి

వాహన తనిఖీలు నిర్వహించిన సీఐ

నరసరావుపేటటౌన్: పెండింగ్ చలానాలు సత్వరమే చెల్లించాలని వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ వాహనదారులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహన పరివార్ ద్వారా ఆన్‌లైన్‌లో పెండింగ్ చలానాలు చెల్లించాలన్నారు. చలానాలు చెల్లంచని వాహనాలు తనిఖీల్లో పట్టుబడిన సమయంలో సీజ్ చేస్తామన్నారు.

ఇప్పటికే పెండింగ్ చలానాలపై మైకు ద్వారా అవగాహన కల్పించామన్నారు. ముఖ్యంగా మైనర్ యువకులు వాహనాలు నడుపుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. మైనర్‌లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే వాహన యజమానులపై కేసు నమోదు చేస్తామన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ విజయ్ చరణ్

థియేటర్ల తనిఖీ..

పట్టణంలోని సినిమా థియేటర్లను పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు థియేటర్లు, పార్కింగ్ ప్రదేశాలు, రద్దీ ఉండే ప్రాంతాలను పరిశీలిస్తున్నట్లు సీఐ చరణ్ తెలిపారు. వ్యాపారులు అప్రమత్తంగా ఉండి అనుమానితుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ఏదైనా అనుమానాస్పదంగా ఉంటే వెంటనే సమాచారాన్ని పోలీసులకు అందజేయాలన్నారు.

ఏ తల్లి కన్నబిడ్డో!!



నరసరావుపేటటౌన్: గుర్తుతెలియని బాలుడు మృతి చెందినట్లు టూటౌన్ సీఐ హైమారావు మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగంగుంట్ల గ్రామం వద్ద గుర్తుతెలియని మూడేళ్ల బాలుడిని చెట్ల పొదల్లో వదిలి వెళ్లారు. ఆదివారం గమనించిన స్థానికులు బాలుడిని నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. బాబు మానసికంగా బలహీనంగా ఉన్నట్లు గుర్తించారు. సంరక్షణ కోసం పోలీసులు ఎన్‌జీవో కాలనీలోని ప్రత్యేక దత్తత సంస్థలో చేర్పించారు. అక్కడ ఉంటూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు సంస్థ మేనేజర్ మాతంగి కుమారి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు నరసరావుపేట టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

సొలసలో చక్రస్నాన మహోత్సవం

ముగిసిన రంగనాధుడి బ్రహ్మోత్సవాలు

యడ్లపాడు: భక్తిశ్రద్ధలతో నిండి, మంగళ ధ్వనులతో మారుమోగిన సొలస గ్రామం ఆధ్యాత్మిక ఆనందానికి కేంద్రంగా మారింది. శ్రీభూ సమేత రంగనాయక స్వామి ఆలయంలో నిర్వహించిన వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య పూజలతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం బిందుతీర్థస్నానం, అర్చనలు, బలిహరణ, వసంతోత్సవం, ప్రధానంగా చక్రస్నానం నేత్రానందంగా జరిగాయి. స్వామివారి చక్రాన్ని తీర్థంలో భాగస్వాములై ఈ పరమ పవిత్ర క్షణానికి భక్తజనం పులకించిపోయారు.

శాస్త్రోక్తంగా....

సాయంత్రం 7 గంటలకు విశ్వక్సేనుడి యాత్రతో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వాహనంపై ఊరేగించారు. ఆలయంలో అంకురార్పణ సందర్భంగా ఆవాహనం చేసిన దిక్పాలకులకు ఉద్వాసన కార్యక్రమం నిర్వహించి, గరుడాల్వార్ చిత్రపటంతో కూడిన వస్త్రాన్ని ధ్వజస్తంభం నుంచి అవరోహించడం ద్వారా బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. ఆలయ అర్చకులు, ధర్మకర్తలు ఈ కార్యక్రమాలను చక్కగా నిర్వహించడాన్ని భక్తులు ప్రశంసించారు. అర్చకులకు ఆలయ మర్యాదలతో సన్మానాలు నిర్వహించగా, స్వామివారి సేవలో పాల్గొన్న ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక సంతృప్తితో మునిగిపోయారు.



చక్రస్నానం చేస్తున్న దృశ్యం

నేటి కార్యక్రమాలు:

బుధవారం ఉదయం రంగనాయకునికి వివిధ రకాల పుష్పాలతో శ్రీ పుష్పయాగం, సాయంత్రం ద్వాదశ ప్రదక్షిణలు, అనంతరం పవళింపు సేవ జరగనున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అధికారులు పిలుపునిచ్చారు.

రెవెన్యూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



నరసరావుపేట: జిల్లాలోని రెవెన్యూ సమస్యలపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పై అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నరసరావుపేట రెవెన్యూ డివిజన్ సమావేశం నిర్వహించారు. దీనిలో రీ–సర్వే, సివిల్ సప్లయస్, ఇమామ్ భూములు, వెబ్ ల్యాండ్ కరెక్షన్‌లు, 22–డీలేషన్స్, జి.ఓ.ఎం.ఎస్.30, నీటితీరువా పన్ను వసూలు, రెవెన్యూ సమస్యలుపై సమీక్ష నిర్వహించారు.

ఉద్యానపంటలతో సుస్థిర ఆదాయం

నాదెండ్ల: ఉద్యానవన పంటల ద్వారా రైతులకు దీర్ఘకాలిక సుస్థిర ఆదాయం లభిస్తుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఎం.సిద్ధలింగమూర్తి చెప్పారు. నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యానవన, వ్యవసాయ, ఉపాధిహామీ పథకం సిబ్బందికి ఉద్యానవన సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19 రకాల ఉద్యానవన పంటల సాగుకు నూరుశాతం ప్రభుత్వం లభిస్తుందన్నారు. మామిడి, జీడిమామిడి, నిమ్మ, బత్తాయి, జామ, తైవాన్‌జామ, కొబ్బరి, సపోట, చింత, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, అంజీర, ఆపిల్‌బేర్, గులాబీ తోట, మల్లెతోట, మునగ, పామాయిల్, డ్రాగన్ ఫ్రూట్ రకాలను సాగు చేసుకోవచ్చన్నారు. ఉద్యానవన శాఖ నిర్దేశించిన సూచనలతో సాగు చేసుకుంటే రైతులకు మంచి దిగుబడి, ఆదాయం లభిస్తుందన్నారు. మూడేళ్ళ వరకూ నిర్వహణవ్యయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. సాంప్రదాయ పంటల సాగుకు ప్రత్యామ్నాయంగా ఉద్యానవన పంటలు సాగు చేసుకుని సుస్థిర ఆదాయం పొందవచ్చన్నారు. అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ శిరీష, హార్టికల్చర్ అధికారి విశాల్, ఏపీవో రామారావు, మూడు శాఖల క్షేత్రస్థాయి సహాయకులు పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు పంపిణీ

నాదెండ్ల: సాతులూరు రైతు సేవా కేంద్రంలో రైతులకు రాయితీపై వ్యవసాయ, అనుబంధ పరికరాల పంపిణీని మండల టీడీపీ అధ్యక్షుడు బండారపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పదకొండు మంది రైతులకు తైవాన్ స్ప్రేయర్లు, వ్యవసాయ ట్రాక్టర్లకు సంబంధించి ఇనుప గొర్రులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందిస్తున్న వివిధ పరికాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

యడ్లపాడు:రాజ్యాంగం కల్పించిన బాలల హక్కులు, చట్టాలను తెలుసుకోవడం ద్వారా అవసరమైన సమయంలో వాటిని సద్వినియోగం చేసుకునే వీలుంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం జోజమ్మ పేర్కొన్నారు. మండలంలోని జాలాది గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఏఎన్ఎం పి.రాణి, జీఎంఎస్‌కే జె.బుల్లెమ్మాయి, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.పద్మ, కె.లలిత, ఆశావర్కర్ పి అరుణ పాల్గొన్నారు.

150 మందికి ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం గుంటూరు ఒమేగా హాస్పటల్స్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణపరీక్షలు నిర్వహించారు. ఆసుపత్రి సీఈవో డాక్టర్ రజిని సుమారు 150 మంది మహిళలకు పరీక్షలు చేశారు. సుమారు పది వేల వరకూ ఖర్చయ్యే పరీక్షను ఉచితంగా నిర్వహించారు. పలువురికి వైద్య సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి డాక్టర్ సాయిశ్వేత మాట్లాడుతూ ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జ్ఞానేశ్వరి, సీహెచ్‌వో కమల, పీహెచ్ఎన్ యేసేశమ్మ, హెచ్‌వీ భవానీ, హెచ్ఎస్ దిలీప్‌కుమార్, ఒమేగా ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లిరోడ్డు కోటబజారు పులుపుల వారి వీధిలోని శ్రీవీరాంజనేయ సహిత శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా 7వ రాతి స్తంభంకు బొలిశెట్టి వెంకట సుబ్బారావు రూ.3,01,116లు విరాళంగా అందించారు. ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించిన వెంకటసుబ్బారావు తన భార్య జ్ఞాపకార్థం విరాళం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వనమా కృష్ణ, సబ్బిశెట్టి వెంకట రమణారావు, కోవూరు శివశ్రీనుబాబు, గజవల్లి మురళీ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ–బి సర్టిఫికెట్ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత

నరసరావుపేట రూరల్: ఎన్‌సీసీ–బి సర్టిఫికెట్ పరీక్షా ఫలితాల్లో నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల క్యాడెట్లు వంద శాతం సాధించినట్టు కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 22, 23 తేదీలలో గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ ఆధ్వర్యంలో బీ సర్టిఫికెట్ పరీక్షలు ఒంగోలులో నిర్వహించారు. ఈ పరీక్షా ఫలితాలను గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ మంగళవారం విడుదల చేసింది. కళాశాల నుంచి 33 మంది క్యాడెట్లు పరీక్షకు హాజరుకాగా వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు 33 మంది ఏగ్రేడ్‌సాధించినట్టు తెలిపారు. ప్రతిభ కనబర్చిన క్యాడెట్స్‌ను కళాశాల చైర్మన్ కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపలి రమేష్‌బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మేడికొండ రాజేష్, అధ్యాపకులు అభినందించారు.

పరిమళించిన ‘మానవ’త్వం

అనాథ శవానికి అంత్యేష్టి సంస్కారం



అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న సమితి సభ్యులు

వినుకొండ: అనాథ శవాలకు అన్ని వారై సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు చేస్తూ మానవ సేవా సమితి సభ్యులు మానవత్వం చాటుకున్నారు. వినుకొండ పట్టణంలో ఎన్నో ఏళ్లగా యాక్షిస్తూ జీవిస్తున్న ఓ అనాథ వృద్ధుడు ఆదివారం వడదెబ్బకు గురై శివయ్య స్థూపం సెంటర్ లో సొమ్మసిల్లి అపస్మారక స్థితిలో పడిపోయారు. యాచకుడి పరిస్థితిని గుర్తించిన మానవ సేవా సమితి అధ్యక్షులు పీవీ సురేష్ బాబు స్పందించారు. సభ్యులను వెంటనే పిలిపించుకొని ఆ వృద్ధ యాచకుడిని ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. చికిత్స పొందుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం ఉదయం మృతి చెందాడు. ఎవరూ లేని అనాథ యాచకుడికి దహన సంస్కారాలు చేసేందుకు సభ్యులందరూ ముందుకు వచ్చారు. అంత్యక్రియలకు అవసరమైన డబ్బులు సభ్యులంతా కలసి చందా వేసుకొని సంప్రదాయబద్ధంగా దహన సంస్కారం చేసి వారి మానవత్వాన్ని చాటుకున్నారు. కరోనా సమయంలో ఎంతోమంది అనాథ శవాలకు అంత్యక్రియలు చేసి వారు మానవత్వాన్ని చాటుకుని ప్రజల అభినందనలు అందుకున్నారు. శవం శివంతో సమానమని భావించిన మానవ సేవా సమితి సభ్యులు అనాథ శవాలకు అంత్యక్రియలు చేస్తున్నారు. మానవ సేవాసమితి సభ్యులు మానవతా దృక్పథంతో చేస్తున్న సేవలకు ప్రజలు అభివాదం చేస్తున్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి చామర్తి భవాని శంకర్, సభ్యులు నాగార్జున, జాబీర్, శ్రావణ కుమార్ పాల్గొన్నారు.

వ్యాపారవేత్త పెనుగొండ వెంకటేశ్వరరావు మృతి



నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

- నివాళులర్పించిన ఎమ్మెల్యే చదలవాడ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- షాపులు మూసేసి సంఘీభావం తెలిపిన జ్యూయలరీ వ్యాపారులు

నరసరావుపేట: వైభవ్ జ్యూయలర్స్ అధినేత, కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు, ది జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, ఆర్య వైశ్య ప్రముఖులు పెనుగొండ వెంకటేశ్వరరావు (86) మంగళవారం గుండెపోటుతో మృతిచెందారు. ప్రకాష్‌నగర్‌లో నివాసం ఉండే వెంకటేశ్వరరావు గుండెల్లో ఇబ్బందికరంగా ఉందని కుటుంబ సభ్యులకు తెలియచేయగా అతని కుమారులు పెనుగొండ ప్రభాకర్, ప్రతాప్‌లు హుటాహుటిన ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించిన పావుగంటకే తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఈ విషయం తెలియగానే ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు పట్టణ ప్రముఖులు స్వగృహంలో ఉన్న ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం తెలియచేశారు. ఆయన మృతికి చిహ్నంగా పట్టణంలో జ్యూయలరీ వ్యాపారులు అందరూ తమ షాపులను మధ్యాహ్నం నుంచి మూసేసి సంఘీభావం తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపలవాయి విజయకుమార్, డ్రగ్స్ అసోసియేషన్ సీమాంధ్ర రీజియన్ కార్యదర్శి కేపీ రంగారావు, ఎన్ఇసీ అధినేత మిట్టపల్లి రమేష్, కంజుల రామకోటిరెడ్డి, కురగంటి శ్రీనివాసరెడ్డి, మిట్టపల్లి శేఖర్, అన్నె చంద్రశేఖర్ నివాళులు అర్పించారు.

కేంద్రియ విద్యాలయంలో నూరుశాతం ఫలితాలు



ఇర్లపాడు కేంద్రియ విద్యాలయం

నాదెండ్ల: సీబీఎస్‌ఈ ఫలితాల్లో ఇర్లపాడు కేంద్రియ విద్యాలయం విద్యార్థులు సత్తా చాటారు. పదో తరగతి తొలి బ్యాచ్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణులయ్యారు. 30 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపల్ సూరజ్‌కుమార్ శ్రీవత్సవ తెలిపారు. పాఠశాలలో చదువుతున్న 30 మంది విద్యార్థులో 500 మార్కులకు గాను 437 మార్కులు సాధించి కారసాల రాగప్రియ మొదటిస్థానం సాధించింది. రెండో స్థానంలో 435 మార్కులతో కాత్ర తపస్విని, మూడోస్థానంలో 425 మార్కులతో షేక్ ఫిర్‌దౌస్‌తనీవ్వర్ నిలిచారు. ఇరవై మందికి పైగా విద్యార్థులు 400 పైబడి మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ నీరజ్‌కుమార్ శ్రీవత్స, ఉపాధ్యాయులు అభినందించారు. 2019–20 విద్యాసంవత్సరంలో చిలకలూరిపేట నియోజకవర్గానికి కేంద్రియ విద్యాలయం మంజూరైంది. అప్పట్లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. పాఠశాలలో తొలి ఐదో తరగతి బ్యాచ్ ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణులయ్యారు.

క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణానికి సన్నాహాలు

స్థలంలో మార్కింగ్ చేసిన ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లు



సీసీయు నిర్మాణ స్థలంలో ఇంజనీర్లతో చైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో జిల్లా ప్రజలకు మరో ప్రభుత్వ హాస్పిటల్ అందుబాటులోకి రానుంది. కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ హాస్పిటల్‌కు పక్కనే ఉన్న 75 సెంట్ల స్థలంలో సుమారు రూ.36 కోట్ల వ్యయంతో 75 బెడ్ల క్రిటికల్ కేర్ యూనిట్ (సీసీయూ) నిర్మాణం చేయబోతున్నారు. ఇప్పటి వరకు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం ఆధీనంలో ఈ స్థలం ఉండగా దానిని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖకు అప్పగించారు. మంగళవారం హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి సమక్షంలో ఏపీఎంఎస్ఐడీసీకి చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీవీ రమణ, డెప్యూటీ ఇంజనీరు హనుమంతరావు నాయక్, ఏఇ సాయి, సిబ్బంది కలిసి స్థలాన్ని పరిశీలించి మార్కింగ్ నిర్వహించారు. సీసీయూ నిర్మాణాన్ని రూ.18.9 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారని, అందులో రూ.11.40 కోట్లతో వైద్యపరికరాలు ఏర్పాటు చేయనున్నారని డాక్టర్ లక్కిరెడ్డి వెల్లడించారు. ఈ మేరకు టెండర్ పిలవటం జరిగిందన్నారు. కాంట్రాక్టర్ నిర్ధారణ జరిగిన తర్వాత నిర్మాణం ప్రారంభమౌతుందని పేర్కొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ఏర్పరచుకోవాలి

చిలకలూరిపేట: మహిళలు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షురాలు గట్టు సరోజిని చెప్పారు. రామకృష్ణ మెమోరియల్ నర్సింగ్ హోం ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఒమేగా క్యాన్సర్ హాస్పిటల్ సౌజన్యంతో మంగళవారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరం ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి కారణంగా మహిళలు క్యాన్సర్ బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒమేగా ఆసుపత్రికి చెందిన రేడియేషన్ అంకాలజిస్టు డాక్టర్ గీతా రుక్మిణి మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన లేకపోవడం వలన ఎన్నో జీవితాలకు శాపంగా మారుతున్నదన్నారు. తొలినాళ్లలో గుర్తించకపోవడంతో ఎంతో మంది మహిళలు ఈ వ్యాధి బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ మహిళలకు ఎక్కువగా సోకే క్యాన్సర్లలో నాల్గొదన్నారు. రొమ్ము క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా 45 మంది మహిళలకు గర్భాశయ, 40 మంది రొమ్ము క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ గైనకాలజిస్టులు డాక్టర్ కొల్లా హేమంతిదేవి, డాక్టర్ కందిమళ్ల జయమ్మ, డాక్టర్ వెల్లటూరి రాణి, డాక్టర్ లావు అరుణతో పాటు డాక్టర్ పెద్దబ్బాయి, క్లబ్ కార్యదర్శి నార్నే జయలక్ష్మి పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

బొల్లాపల్లి: మండలంలోని బండ్లమోటు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎంటీ ఎస్ ఉపాధ్యాయుడు పి.మైకల్ మంగళవారం గుండెపోటుతో మృతిచెందారు. పండ్లమోటా పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న మైఖేల్‌ను డెప్యూటేషన్‌పై బొల్లాపల్లి రెగ్యులర్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు.